క్లుప్తంగా

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ

గూడూరురూరల్: ఎన్నికల కోడ్ జూన్ 4వ తేదీ వరకు అమల్లో ఉన్నందున గూడూరు సబ్ డివిజన్‌లో సభలు, సమావేశాలు, ధర్నాలు, ర్యాలీలను నిషేధించినట్లు గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. పట్టణంలోని టవర్‌క్లాక్ సెంటర్ వద్ద బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు ముగిసినా ఫలితాలు వెలువడే వరకు 144 సెక్షన్‌తోపాటు పోలీస్ యాక్ట్ 30 అమల్లో ఉంటుందని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సభలు, సమావేశాల నిర్వహణకు ముందస్తుగా పోలీసు అనుమతి తప్పనిసరి అని అన్నారు. అదేవిధంగా ఈనెల 13న ఎన్నికల సందర్భంగా చిల్లకూరులో జరిగిన ఘటనకు సంబంధించి విచారణ మొదలెట్టామని, అందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సీఐలు పాపారావు, వేణుగోపాల్ రెడ్డి, రవికిరణ్, ఎస్ఐలు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

గూడూరురూరల్: వెంకటగిరి అడ్డరోడ్డు సమీపంలోని అమ్మవారిపేట వద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కూరపాటి రవీంద్రబాబు కోరారు. రవీంద్రబాబు మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల మనోభావాలను దెబ్బతీసే దుష్టశక్తులను అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు స్పందించి విద్రోహుల వెనుక ఎంతటి వారున్నా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు.

ఉచితంగా ఖత్నా

సూళ్లూరుపేట రూరల్: సూళ్లూరుపేట నియోజకవర్గ స్థాయిలో నిరుపేద ముస్లిం పిల్లలకు ఉచితంగా ఖత్నా నిర్వహించామని అక్బరియా మసీదు కమిటీ సభ్యులు ఎం.ఏ మాలాక్ బుధవారం తెలిపారు. స్థానిక షాదీఖానాలో 20 మంది పిల్లలకు ఉచితంగా ఖత్నా చేసి వారికి కావాల్సిన మందులు కూడా ఉచితంగా అందజేశామన్నారు. చిత్తూరు జిల్లా పుంగనూరు వైద్యులు మస్తాన్‌చే ఈ కార్యక్రమం నిర్వహించామని పేర్కొన్నారు. అక్బరియా మసీదు ముత్తవల్లి, సెక్రటరీ ఖాదర్ షరీఫ్, సభ్యులు అజీజ్ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చిల్లకూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు బుధవారం ఎంపీడీఓ భానుమూర్తి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సర్వసభ్య సమావేశాన్ని మండల పరిషత్ అధ్యక్షురాలు తుపాకుల వెంకటరమణమ్మ అధ్యక్షతన నిర్వహిస్తున్నామని, సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల మండల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

సభలు, ర్యాలీలు నిర్వహించొద్దు

చిల్లకూరు: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తిరుపతి ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఉత్తర్వులతో ప్రతి గ్రామంలో 144వ సెక్షన్ అమలులో ఉందని దీనిని దృష్టిలో ఉంచుకుని ర్యాలీలు, సభలు నిర్వహించవద్దని చిల్లకూరు ఎస్ఐ అంజిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో అక్కడక్కడ చెదురు మదురు సంఘటనలు తప్ప మిగిలిన చోట్ల ప్రశాంతంగా ముగిశాయని ఇందుకు సహకరించిన ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఫలితాలు విడుదల జరిగే వరకు ఎక్కడ కూడా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించి ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దాడిపై విచారణ



విచారణ చేస్తున్న ఎస్ఐ

చిల్లకూరు: చింతవరం గ్రామానికి చెందిన ఎరువుల దుకాణదారుడు గోపాల్‌పై జరిగిన దాడి విషయంపై బుధవారం ఎస్ఐ అంజిరెడ్డి విచారణ చేశారు. మంగళవారం ఉదయం దుకాణం తెరిచే సమయంలో చింతవరం కొత్తపాళెంకు చెందిన ముగ్గురు యువకులు గోపాల్‌పై దాడి చేసి గాయపరిచిన విషయం తెలిసిందే. దీనిపై గోపాల్ ఇచ్చిన సమాచారం మేరకు గ్రామంలో ఎస్ విచారణ చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

వెంకటగిరిరూరల్: పట్టణంలోని బొగ్గుల మిట్టకు చెందిన చేనేత కార్మికుడు రాయని బద్రి బుధవారం మృతిచెందారు. ఈ మేరకు స్థానిక వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య బద్రి అంత్యక్రియల నిమిత్తం రూ.5వేలు బద్రి కుటుంబసభ్యులకు అందజేశారు. ఒందూరు వెంకటరత్నంరాజు, కొండూరు గోపాల్‌రాజు, శ్రీహరికోట నారాయణ, శ్రీరామ్ రమణమ్మ పాల్గొన్నారు.

నాడు-నేడుతో భరోసా

- మారిన సర్కార్ బడులు
- విద్యార్థులకు ఆంగ్లంలో బోధన
- నాణ్యతగా జగనన్న గోరుముద్ద
- అమ్మఒడితో తల్లులకు ఒరవడి



నాడు-నేడుతో తల్లంపాడు ప్రాథమిక పాఠశాల



నేలపట్టు ఎస్టీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల

దొరవారిసత్రం: గతంలో సర్కారు బడులు అంటే అందరికీ చిన్నచూపు. ఇప్పుడు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మన బడి నాడు-నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల్లో సమూల మార్పులు చోటుచేసుకున్నాయి. ఇటు విద్యార్థులకు, అటు టీచర్లకు వివిధ సదుపాయాలు కల్పించడమే కాకుండా కార్పొరేట్ పాఠశాలకు దీటుగా బడుల్లో మౌలిక సదుపాయాలు కల్పించారు. దీంతో విద్యార్థులు సర్కారు బడుల వైపు పరుగులు తీస్తున్నారు.

దానికి తోడు విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఈ బడుల వైపు మొగ్గు చూపిస్తున్నారు. ప్రతి విద్యార్థికి అమ్మఒడి పథకం ద్వారా తల్లుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా ఏటా రూ.15వేలు నగదు జమ కావడంతో వారికి ఎంతో ఒరవడి ఇచ్చినట్టైంది. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేద విద్యార్థికి చదువు దూర భారం కాకూడదనే తలంపుతో నాణ్యమైన విద్యను ప్రాథమిక నుంచి ఉన్నత స్థాయి చదువుల వరకు అందించాలనే దృఢ సంకల్పంతో అనేక సంక్షేమ పథకాలు, కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అవి క్రమం తప్పకుండా ఏటా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి అందిస్తూ వస్తున్న ఘనత ఈప్రభుత్వానికే దక్కుతుంది.

డీవీసత్రంలో బడులకు కొత్త రూపురేఖలు..

దొరవారిసత్రం మండలం పరిధిలో ప్రాథమిక పాఠశాలలు 51, ప్రాథమికోన్నత పాఠశాలల 5, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 6, కేజీబీవీ, బీసీ గురుకుల పాఠశాల, ఆదర్శపాఠశాలల్లో 5,698 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. తొలివిడత నాడు-నేడు కింద రాష్ట్ర ప్రభుత్వం 22 పాఠశాలలకు రూ.2.61 కోట్లు, రెండవ విడతలో 33 పాఠశాలలకు నాడు-నేడు నిధులు రూ.6కోట్లను మంజూరు చేసింది. కేటాయించిన నిధులతో ఆయా ప్రాంతాల్లోని పాఠశాల కమిటీ భవనాల మరమ్మతులు, విద్యుత్ సదుపాయం, ప్రహరీ నిర్మాణ, విద్యార్థులకు అవసరమైన తాగు నీటి వసతి, మరుగుదొడ్ల నిర్మాణం, బెంచీలు, బోర్డులు వసతులు కల్పించారు. వీటితో పాటు విద్యార్థులను ఆలోచింపచేసే విధంగా, ఆకట్టుకునేలా ప్రహరీ గోడలపై, పాఠశాల గదుల్లో ఎంతో అందంగా బొమ్మలను ఏర్పాటు చేశారు. ఇవే కాకుండా ప్రతి విద్యార్థికి మంచి పోషక విలువలు కలిగిన ఆహారం అందేలా గోరుముద్ద పథకం తీసుకొచ్చి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందేలా ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇవే కాకుండా టీచర్లకు ఎప్పటికప్పుడు విద్యాభ్యాసం, విద్యావిధానంపై ప్రభుత్వం శిక్షణ ఇస్తూ విద్యార్థులకు ఆంగ్లంలో ఉపాధ్యాయులు బోధించే విధంగా చర్యలు తీసుకుంది. ప్రభుత్వ బడులు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా సిద్ధం కావడంతో ప్రతి విద్యార్థితో పాటు పిల్లల తల్లిదండ్రులు సైతం సర్కారు బడుల వైపు మొగ్గు చూపడంతో విద్యార్థుల సంఖ్య ప్రతి ఏటా గణనీయంగా పెరుగుతోందని సంబంధిత అధికారులు తెలియజేశారు.

అమ్మఒడి సచివాలయాల వారీగా..

డీవీసత్రం మండలంలోని 11 గ్రామ సచివాలయాల్లో ఇప్పటి వరకు నాలుగు విడతల్లో 4,085 విద్యార్థులకుగాను రూ.18,64,06,067 అమ్మఒడి నగదు తల్లులు ఖాతాల్లో జమ అయింది. ఇదే కాకుండా విద్యాదీవెన కింద 2,253 మంది విద్యార్థులకుగాను ఇప్పటి వరకు రూ.7,77,89,594, వసతి దీవెన కింద 1,796 మంది విద్యార్థులకు రూ.2,89, 60,485 నగదు అందింది.

అమ్మఒడితో ఎంతో ప్రయోజనం..



మాలాంటి పేద కుటుంబాలకు అమ్మఒడి పిల్లలకు ఎంతో ప్రయోజనం చేకూరింది. ఈడబ్బుతో పిల్లలకు అవసరమైన అన్ని అవసరాలు తీరుతున్నాయి. ఈప్రభుత్వం చేసిన మేలు ఎప్పటికీ మరులేనిది. ఈప్రభుత్వం ఉంటేనే విద్యార్థుల చదువులకు ఏలాంటి ఆటంకాలు ఏర్పడవు.

ఎం శాంతి, విద్యార్థి తల్లి, నేలపట్టు

ఈప్రభుత్వం ఉంటేనే..



విద్యార్థులకు పథకాలు అన్ని సకాలంలో అందాలంటే ఈప్రభుత్వం ఉంటేనే సాధ్యం. ఈప్రభుత్వం దయతోనే విద్యార్థులకు అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెనతో అందుతున్నాయి. ఇవే కాకండా గోరుముద్ద వలన పిల్లలకు మంచి ఆహారం అందుతోంది.

ఆర్ ఏలిషా, విద్యార్థి తండ్రి, ముచ్చలగుంట

పెరుగుతున్న నిమ్మ ధరలు



నిమ్మకాయలు

సైదాపురం: నిమ్మకాయల ధరలు మూడు రోజులుగా రోజురోజుకు ధరలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో నిమ్మకాయలు రూ.40 నుంచి రూ.140 ధర పలుకుతోంది. అయితే నాణ్యత కలిగిన కాయలు ధర రూ.140 పలుకుతున్నట్లు రైతులు పేర్కొన్నారు.సైదాపురం మండలంలో రైతులు నిమ్మ పంటలపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఇతర పంటల వైపు కూడా ఈప్రాంత రైతులు పెద్దగా దృష్టి సారించరు. రబీ సీజన్‌లో వరి పంటను సాగు చేసే రైతులు తర్వాత నిమ్మ, బొప్పాయి, మినుమ, పెసర పంటలపై ఆధారపడి జీవిస్తున్నారు. గత ఏడాదిలో పాటు ఈఏడాది కూడా ఏప్రిల్, మే నెలల్లో కాయలు దిగుబడి కూడా తోటల్లో ఆశించిన స్థాయిలో ఉన్న కారణంగా ఆర్థికంగా బలపడ్డారు. సకాలంలో వర్షాలు కురుస్తుండడంతో నిమ్మ తోటలకు నీటి కోసం రైతులకు ఖర్చులు తగ్గిపోయాయి. ఫలితంగా నీటి యాజమాన్యం పద్ధతులు సులువుకావడంతో లేత తోటలకు ప్రభుత్వం సూక్ష్మ సేద్యం కింద డ్రిప్, స్ప్రింకర్లు ఏర్పాటుకు రాయితీని పునరుద్ధరించడడంతో రైతులు ఎంతో సంతోషంగా సేద్యం చేస్తున్నారు. నిమ్మకాయలకు అధిక ధరలు లభిస్తుండడంతో రైతులు ఆనందంగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

గ్రామాల్లో వెల్లివిరిసిన చైతన్యం

- 93 శాతం ఓటింగ్ నమోదు



నాయుడుపేటటౌన్: మండల పరిధిలోని అనేక గ్రామాల్లో ఓటర్లు ఎండ తీవ్రతను సైతం లెక్క చేయక తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండలంలోని అరవపేరిమిడి గ్రామంలోని 97వ పోలింగ్ బూత్‌లో మొత్తం 678 ఓట్లకుగాను 632 మంది ఓటు హక్కును వినియోగించుకుని మండలంలో 93.22 శాతంగా మొదటి స్థానంలో నిలిచింది. మర్లపల్లి గ్రామంలోని 81 పోలింగ్ బూత్‌లో 624 మంది ఓటర్లకుగాను 564 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో 90.38 శాతంగా నమోదైంది. కుచివాడపాళెం గ్రామంలో 111 పోలింగ్ బూత్‌లో 403 మంది ఓటర్లు ఉండగా వారిలో 364 మంది ఓటు వేయడంతో 90.32 శాతం నమోదైంది. అదే విధంగా తక్కువ శాతంగా నమోదైన గ్రామాల్లో మేనకూరు 99 పోలింగ్ బూత్‌లో 827 మందిగాను 642 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకోవడంతో 77.63 శాతంగా నమోదైంది. మేనకూరు 100వ పోలింగ్ బూత్‌లో 1,093 మందికిగాను 850 మంది ఓటు హక్కు వినియోగించుకుని 77.77 శాతంగా నమోదైంది. గొట్టిప్రోలు గ్రామంలోని 89 పోలింగ్ కేంద్రంలో 710 మందికి గాను 554 మంది ఓట్లు వేసి 78.03 శాతంగా నిలిచింది. మిగిలిన పోలింగ్ కేంద్రాల్లో 80 శాతం వరకు పోలింగ్ శాతం నమోదై ఉంది. నాయుడుపేట అర్బన్ పరిధిలో పట్టణంలోని అగ్రహారపేట దళిత కాలనీలోని 57వ పోలింగ్ బూత్‌లో 810 మందికిగాను 728 మంది ఓటు వేసి అత్యధికంగా 89.88 శాతంగా నమోదైంది. తుమ్మూరు ఎస్ఎస్ఆర్ కాలనీకి సంబంధించిన 78వ బూత్‌లో 802 మందికిగాను 685 మంది ఓట్లు వేయడంతో 85.41 శాతం నమోదైంది. విన్నమాల గ్రామంలోని 73 పోలింగ్ బూత్‌లో 797 మందికిగాను 674 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో 84.47 శాతంగా నమోదైంది. తక్కువ శాతంగా నమోదైన వాటిలో పిచ్చిరెడ్డితోపు 50వ పోలింగ్ బూత్‌లో 926 మందికిగాను 593 మంది ఓట్లు వేసి 64.04 తక్కువ శాతంగా నమోదైంది. అమరా గార్డెన్ అగ్రహారపేట 49వ పోలింగ్ బూత్‌లో 1349 మంది ఓటర్లకు గాను 912 మంది ఓట్లు వేసి 67.61 శాతంగా నిలిచింది. అగ్రహారపేట మోహన్‌బాబుతోట 53 వ పోలింగ్ బూత్ 887 మంది ఓటర్లకు గాను 598 మంది ఓట్లు వేసి 67.42 శాతంగా నమోదైంది. అర్బన్ పరిధిలో మిగిలిన పోలింగ్ కేంద్రాల్లో కూడా 80 శాతం తగ్గకుండా ఓటర్ల తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అత్యధికంగా మహిళలే వచ్చి వారి ఓటు హక్కు వినియోగించుకోవడంతో అభ్యర్థి విజయం వారి ఓట్లపైనే ఆధారపడివుంది.

పూర్తికాని మినరల్ వాటర్ ప్లాంట్లు



కొత్తపల్లిలో ప్రారంభానికి నోచుకోని వాటర్ ప్లాంట్

దొరవారిసత్రం: మండలంలోని ఎనిమిది పంచాయతీలకు 2019-20లో కేంద్ర ప్రభుత్వం పీఎంఏజీవై నిధుల కింద రూరల్ వాటర్ సప్లయ్ అండ్ శానిటేషన్ శాఖ ద్వారా మినరల్ వాటర్ ప్లాంట్లను ఒక్కొక్క దగ్గర రూ.10లక్షల వ్యయంతో మంజూరు చేశారు. ఇందులో కొత్తపల్లి, సింగనాలత్తూరు, కొత్తపల్లి, నేలపట్టు పంచాయతీ కేంద్రాల్లో భవనం, మినరల్ ప్లాంట్, బోరు పాయింట్ వంటి పనులు చేశారు. మిగిలిన దగ్గర పంచాయతీ కేంద్రాల్లో పనులే మొదలుకాలేదు. మీజూరులో మాత్రం గత ఏడాదే మినరల్ ప్లాంట్ ప్రారంభమై తాగునీటి సరఫరా అందే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. మిగిలిన కొత్తపల్లి, నేలపట్టు, సింగనాలత్తూరు ప్రాంతాల్లో ప్లాంట్లు నిర్మించగా కేంద్రం ప్రభుత్వం నుంచి బిల్లులు సక్రమంగా రాకపోవడం వలన రెండేళ్లగా ఎక్కడి పనులు అక్కడే కాంట్రాక్టర్లు ఆపేసినట్లు తెలుస్తోంది. కొత్తపల్లి గ్రామ పరిధిలోని నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్ పూర్తి స్థాయిలో పనులు చేసినప్పటికీ బిల్లులు పూర్తిస్థాయిలో కాంట్రాక్టర్‌కు రానందు ప్లాంట్ నిర్మాణం పూర్తి చేసినప్పటికీ రెండేళ్లగా ప్లాంట్‌ను పంచాయతీకి అప్పగించకుండా ఉన్నట్లు తెలుస్తుంది. సంబంధిత అధికారులు స్పందించి బిల్లులు చెల్లింపులు విషయంలో జాప్యం చెయ్యకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎతైనా ఉంది.

ఘర్షణలకు పాల్పడితే పీడీ యాక్ట్



సీఐ శ్రీనివాసరెడ్డి

నాయుడుపేటటౌన్: మండలంతో పాటు అర్బన్ పరిధిలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి వివాదాలు లేకుండ శాంతియుతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారని సీఐ శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు సహకరించిన అధికారులతో పాటు అన్ని పార్టీల నాయకులు ముఖ్యంగా ఓటర్లకు సీఐ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాలతో పాటు పట్టణాల్లో ఎక్కడా ఎన్నికల సంబంధించి వివాదాలు చేసుకోవద్దని సామరస్యపూరితంగా వ్యవహరించాలన్నారు. వివాదాలు చోటుచేసుకుంటే వారిపై పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు. అదే విధంగా ఎన్నికల కౌంటింగ్ రోజు కూడా ప్రతి ఒక్కరు శాంతియుతంగా వ్యవహరించాలన్నారు.

శ్రీరామాలయ పునర్నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పట్టణం గాండ్లవీధిలో పురాతన శ్రీరామాలయ పునర్నిర్మాణానికి బుధవారం భూమి పూజ జరిగింది. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు పూజల్లో పాల్గొని, కొబ్బరికాయ కొట్టి ఈ క్రతువును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దక్షిణ కై లాసంగా ఖ్యాతిచెందిన శ్రీకాళహస్తిలో ఆధ్యాత్మికత దిశగా ప్రజలు మమేకం అయ్యారనేందుకు ఆలయాల నిర్మాణమే నిదర్శనమన్నారు. గాండ్ల సంఘం సభ్యులు, ప్రముఖులు రాజేంద్రప్రసాద్, రవి, గణేష్, సురేష్, విజయశేఖర్, చంద్రశేఖర్, మునిలక్ష్మి, గీత, లక్ష్మి, దేశమ్మ పాల్గొన్నారు.

18 నుంచి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు



సూచనలు ఇస్తున్న ఈఓ నాగేశ్వర్‌రావు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం అనుబంధంగా మండలంలోని ఊరందూరులో వెలసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 18 నుంచి 28 వరకు నిర్వహించనున్నట్లు ఈఓ కేవీ నాగేశ్వర్‌రావు తెలిపారు. ఊరందూరులోని చెన్నకేశవస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల ఏర్పాట్లును బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులకు కొన్ని సూచనలు చేశారు. ఏఈఓ సతీష్ మాలిక్, అనుబంధాలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, ఆలయాధికారి వేణు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



సుగంధ ద్రవ్యాల మిశ్రమం ఊరేగింపులో అధికారులు, అర్చకులు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. గర్భాలయాలను శుద్ధి చేసి గోడలను సుగంధ ద్రవ్యాలతో లేపనం చేశారు. ఈ నెల 21 నుంచి 29 వరకు ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరిచి నిత్యపూజలు, కై ంకర్యాలు చేశారు. వివిధ రకాల సుగంధ ద్రవ్యాలు, తిరుచూర్ణంతో కలిసిన మిశ్రమాలను మేళతాళాలతో ఆలయ అంతర ప్రాకారంలో పరిచారకులు ఊరేగించారు. అనంతరం వెంకన్న ఆలయంతో పాటు పద్మావతీ అమ్మవారు, గోదాదేవి గర్భాలయాల గోడలకు పూతవేశారు. మధ్యాహ్నం 2 గంటలకు గంటను నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. టీటీడీ స్థానిక ఆలయాల డిప్యూటీ ఈవో నాగరత్న, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, అర్చకులు శ్రీధరభట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య, నరసింహ భట్టాచార్య పాల్గొన్నారు.

సత్యవేడు జాతర చాటింపు



సత్యవేడులో గంగమ్మకు అంబళ్లు పోసి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

- సత్యవేడు జాతరకు వందేళ్లు
- గంగమ్మకు అంబళ్లు..
- చల్లాతమ్మకు పొంగళ్లు



చదవాలమ్మ గుడి వద్ద పొంగళ్లు పెడుతున్న మహిళలు

సత్యవేడు: జాతర నిర్వహణలో భాగంగా బుధవారం ఉదయం గంగమ్మ గుడివద్ద చలువ పందిళ్లు వేసి గంగమ్మకు ఇళ్ల వద్ద నుంచి అంబలి తీసుకువచ్చి గుడి ముందు ఉంచిన పెద్ద పాత్రల్లో పోసి కర్పూర హారతులు ఇచ్చి వేపాకు సమర్పించారు. మధ్యాహ్నం సదవాలమ్మ గుడి వద్ద పొంగళ్లు పెట్టారు. మే 29, 30 తేదీల్లో సత్యవేడులో జాతర నిర్వహిస్తారు. జాతరకు 15 రోజులు ముునుపు వచ్చే బుధవారం చాటింపు వేస్తారు. రాత్రి 8 గంటలకు అమ్మవారి కలశం ఊరేగింపు అనంతరం జాతర చాటింపు వేస్తారు. జాతర సందర్భంగా గ్రామంలో నలుదిక్కులలో పూజలు నిర్వహిస్తారు. రెండవ బుధవారం నడివీధి గంగమ్మ గుడి వద్ద అంబళ్లుపోస్తారు.

వందేళ్ల పైగా చరిత్ర

సత్యవేడు జాతరకు వందేళ్ల పైగా చరిత్ర ఉంది. సత్యవేడులో వెలసిన సదవాలమ్మ(గంగమ్మ) సృష్టిస్థితి లయలకు మూల కారకులైన శక్తికి ప్రతిరూపంగా ఇక్కడ ప్రజలు భావిస్తారు. భక్తిశ్రద్ధలతో ప్రతియేటా జాతర నిర్వహిస్తున్నారు. మత సామరస్యాలకు ప్రతీకగా సత్యవేడు జాతర నిర్వహిస్తున్నారు. సత్యవేడు జాతరకు చుట్టుపక్కల ఉన్న 50 గ్రామాలకుపైగా ప్రజలు హాజరవుతారు.

ఎన్‌సీసీ క్యాంపునకు 40 మంది విద్యార్థినులు



తిరుపతి ఎన్‌సీసీ క్యాంపునకు హాజరైన పిచ్చాటూరు జెడ్పీ హైస్కూల్ ఫ్లస్ విద్యార్థినులు

పిచ్చాటూరు: తిరుపతిలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాంపులో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 40 మంది విద్యార్థినులు పాల్గొన్నట్లు ప్రధానోపాధ్యాయులు గిరిప్రకాష్ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎన్‌సీసీ క్యాంపులకు బాలురు వెళ్లడం ఆనవాయితీగా ఉండేదన్నారు. బాలికలు హాజరుకావడం ఇదే తొలిసారన్నారు. పురుషులతో సమానంగా మహిళలు అన్నీ రంగాల్లో రాణించాలన్న ఉద్దేశంతో గత ఏడాది ప్రభుత్వం తమ పాఠశాలలో బాలికలకు ఎన్‌సీసీలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అలా శిక్షణ పొందిన 40 మంది విద్యార్థినులు ప్రస్తుతం క్యాంపులో పాల్గొన్నారని పేర్కొన్నారు. జెడ్పీ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ ఇన్‌చార్జ్ అమ్ములు పాల్గొన్నారు.

కండలేరులో 6.784 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం 6.784 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 220 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, లోలెవల్ కాలువకు 70 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధి పనుల్లో లక్ష్యాన్ని అధిగమించాలి



రావిళ్లవారికండ్రిగలో పనులు పరిశీలిస్తున్న శ్రీనివాసప్రసాద్

ఏర్పేడు: ఉపాధి హామీ పథకంలో కూలీలకు పనులు కల్పించడంలో ఫీల్డ్ అసిస్టెంట్లు టార్గెట్‌ను అధికమించాలని లేకుంటే ఇళ్లకు పంపుతామని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని పెన్నగడం, రావిళ్లవారికండ్రిగ గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో వ్యవసాయ పనులు లేక పోవడంతో కూలీలు ఉపాధిహామీ పనులకు విరివిగా వస్తారన్నారు. సిబ్బంది కూలీలతో రోజూ మాట్లాడి అత్యధికంగా పనులకు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు.

పనుల ప్రదేశంలో వసతులు

పనుల్లో కొలతలను బట్టి కూలీలకు వేతనం లభిస్తుందని పీడీ తెలిపారు. గతంలో కూలీలకు రోజుకు రూ.272 వేతనం ప్రభుత్వం చెల్లిస్తుందేదన్నారు. ఏప్రిల్ ఒకటి నుంచి రోజు వేతనాన్ని రూ.300 పెంచినట్లు వివరించారు. ఎండతీవ్రత పెరుగుతుండడంతో ఉదయం 6 గంటలకు పనులు ప్రారంభించి 10 లోపు ముగించాలని తెలిపారు. పని ప్రదేశంలో కూలీలకు నీరు, నీడ, ప్రథమ చికిత్స పెట్టె అందుబా టులో ఉంచాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రైతుల పొలాల్లో మామిడి, పూలు, మునగ తోటల పెంపకం చేపట్టేలా సిబ్బంది చొరవ చూపాలని తెలిపారు. ఏపీఓ దేవరి, సీడీసీఎల్ఆర్సీ చంద్రశేఖర్ రాజు, జేఈ బాలాజీరావు, క్షేత్ర సహాయకులు యతిశంకర్, చంద్రయ్య పాల్గొన్నారు.